# 5. శిక్ష

శ్మశాన భూమంతా ఆఫీసర్లతో నిండివుంది. రకరకాల దుస్తుల్ని ధరించిన ఉద్యోగులు, సూర్యకిరణాలు పడి తళతళా మెరిసే వారి లోహపు గుండీలతో, బూట్ల టకటకల్తో మిగతా సమాధులన్నిటినీ తప్పించుకుంటూ తిరిగి వస్తున్నారు.

కలొనెల్ లిమౌసిన్ భార్య ఇంతకుముందే సమాధి చేయబడింది. రెండు రోజుల క్రితం నదిలో స్నానం చేస్తూ ఆమె మునిగి చనిపోయింది. ఇప్పుడు కర్మకాండ అంతా పూర్తయింది. పురోహితుడు వెళ్ళిపోయాడు. కలొనెల్ మాత్రం సమాధి దగ్గరే నిలబడిపోయాడు. అతని పక్కన ముఖ్యులైన ఇద్దరు ఆఫీసర్లు వున్నారు. కలొనెల్ తదేకంగా గోతి అడుగున వున్న ఒక పెట్టె వైపు చూస్తున్నాడు.

కలొనెల్ దాదాపు ముసలివాడు. సన్నగా పొడుగ్గా తెల్లని మీసాలతో గంభీరంగా కనిపిస్తాడు. మూడేళ్ళ క్రితమే అతను తన స్నేహితుని కుమార్తెను వివాహమాడాడు. ఆమెకు ఎవ్వరూ లేరు. ఆ అనాథను, యువతిని ఆమె తండ్రి చనిపోయి దిక్కులేని స్థితిలో వుండగా తనకు భార్యగా చేసుకున్నాడు.

కలొనెల్‌కు సహాయంగా వుండిపోయిన ఇద్దరు ఆఫీసర్లూ ఎలాగైనా అతన్ని తీసుకొని వెళ్దామని ప్రయత్నించారు. కాని కలొనెల్ "అప్పుడేకాదు... కాస్సేపు ఉందాం" అన్నాడు. అతని కళ్ళు దాదాపు చెవులదాకా సాగినవి. గోతికి ఒక పక్కగా అతని కాళ్ళు భూమిలోకి దిగిపోతున్నట్లున్నాయ్. ఆ గొయ్యి- దానికి అడుగు కనిపించటం లేదు. ఆ గోతిలోనే తన ప్రాణమున్నంత బాధ కలిగింది. లోకంలోకెల్లా తనకి ప్రియతమమైన వస్తువును కోల్పోయిన శూన్య హృదయం కలొనెల్‌ను కదలనివ్వటం లేదు.

హఠాత్తుగా జనరల్ ఓర్‌మంట్ వొచ్చి కలొనెల్ చెయ్యిపట్టుకుని బలవంతంగా లాక్కువెళ్తూ "భాయీ! నీవు మరి ఇక్కడ ఉండరాదు" అన్నాడు.

కలొనెల్ మరేమీ మాట్లాడకుండా ఇంటికి వెళ్ళాడు. తన గది తలుపు తెరవగానే టేబిల్ మీదవున్న ఒక కవరు అతన్ని ఆశ్చర్యపెట్టింది. ఆ కవరు మీది దస్తూరి తన భార్యదే! సంభ్రమంతో అతను దాదాపు నేలవాలే వాడయ్యాడు. ఆ కవరు మీది పోస్టుముద్రలు ఆనాటివే! ఆతృతగా కవరు చించి చదవసాగాడు.

"తండ్రీ!

నిన్ను ఈ విధంగానే సంబోధించినందుకు అనుమతించండి. నా చిన్నతనంలో, మీరు నన్ను వివాహమాడేవరకూ నేను మిమ్ము 'తండ్రీ' అనే సంబోధించేదాన్ని. ఈ ఉత్తరం మీకు జేరేప్పటికి నేను మరణించి మట్టిలో కలిసిపోతూంటాను. ఇది కారణంగా మీరు నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను.

"మీనుంచి సానుభూతిని, దయను సంపాయిద్దామని కాని, నా పాపాన్ని పరిహరించుకుందామని కాని నేనీ ఉత్తరాన్ని రాయటం లేదు. మరోగంటలో ఆత్మహత్య చేసుకోబోతున్న నేను, హృదయపూర్వకంగా సత్యాన్ని బైటపెట్టి నా విధ్యుక్తధర్మాన్ని నెరవేరుద్దామనే ఉద్దేశంతో ఈ ఉత్తరాన్ని రాస్తున్నాను.

"నామీది కరుణచేత మీరు నన్ను వివాహమాడారు. ఏకాకికా, అనాధగా వున్న నాకు ఒకదారి చూపారు. మీరు నా పట్ల చూపిన దయకు విశ్వాసంగా నేను మిమ్ము హృదయపూర్వకంగా ప్రేమించాను. నా నిజ జనకుణ్ణి ఎలా ప్రేమించేదాన్నో, మిమ్ము అదేవిధంగా, అంత గాఢంగానూ ప్రేమించాను.

"ఒకనాడు మీరు నన్ను ఒళ్ళో కూర్చోపెట్టుకొని ముద్దుపెట్టుకుంటుండగా నేను 'నాన్నా!' అని పిలిచాను. ఎంత ప్రయత్నించినా అలా పిలవలేకుండా ఉండలేకపోయాను... కారణం ఏం లేదు, హృదయాంతరాళంలో దాగిన సత్యం దానంతటదిగా బైటపడింది. దాని గొంతు పిసికెయ్యాలని, వేరొక విధంగా నటించాలని చేసే ప్రతి ప్రయత్నమూ విజయవంత మవదు! ఎప్పుడో ఏమరుపాటునో ఆ సత్యం పొంగి పొరలకమానదు. దూరం ఆలోచిస్తే మీరు నాకు భర్తా? కాదు... తండ్రి! అంతకుమించి నేను వేరొక రూపాన మిమ్ము చూడలేను. మీకు కోపం వస్తుందేమో ననుకున్నాను. కాని మీరు నవ్వి నన్ను ఎప్పుడూ నాన్నా అనే పిలువు. అలా పిలిపించుకోవటం నాకు ఎంతో ఆనందంగా వుంటుంది! అన్నారు.

"ఆ తరువాత మనం పట్టణానికి వచ్చాం. అంతకు పూర్వం నాకు తెలియని అనేక ఆకర్షణలకు గురయ్యాను. అక్కడికీ రెండేళ్ళపాటు ఎంతో ప్రయత్నంమీద శీలాన్ని కాపాడుకోగలిగాను. కాని నేను కూడా ఒక సామాన్య మానవమాత్రురాల్ని... నన్ను

క్షమించండి– ఇక నన్ను నేను కాపాడుకోలేక నేను ప్రణయంలో పడ్డాను. ఆ పాప కూపాన పడి పతితనయ్యాను.

“ఎవరి ప్రేమలో అనే ప్రశ్న వస్తుంది. ఆయన ఎవరో మీరు ఎన్నటికీ ఊహించనైనా వూహించలేరు. మీ దగ్గర పనిచేసే డజను ఆఫీసర్లు ఉన్నారు. వాళ్ళు నాకు రక్షకులల్లే వున్నారని వారే అనేకసార్లు ఎగతాళి చేసేవారు. వాళ్ళల్లోనుంచి ఒకర్ని ఏరుకోవటం నాకంత కష్టమనిపించలేదు.

“తండ్రీ! నా ప్రియుణ్ణి తెలుసుకునే ప్రయత్నం మీరు చేయవద్దని కోరుతున్నాను. ఆయన తప్పేమున్నది? ఆయన స్థానంలో ఏ మొగాడు వున్నప్పటికీ అదేవిధంగా ప్రవర్తించి ఉండేవాడనేందుకు సందేహం లేదు. నా ప్రయత్నం భగ్నం కాలేదు. నేను ఆయన్ను ఎంత హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నానో ఆయనకూడా నన్ను అంత గాఢంగానూ ప్రేమిస్తున్నాడని తెలుసుకునేందుకు ఎక్కువ కాలం పట్టలేదు.

“కాని వినండి; ఒకనాడు నది మధ్యలో వున్న చిన్న ద్వీపంలో కలుసుకునేందుకు ఏర్పాటు చేసుకున్నాం. నాకన్న ముందేవెళ్ళి ఆయన అక్కడ ఒత్తుగా పెరిగిన అడివిగడ్డి చాటున వేచి ఉంటాడు. నేను యీదుకుంటూ వెళ్ళి ఆయనతో చీకటిపడేవరకూ వుంటాను. చీకట్లో ఎవ్వరికంటా పడకుండా ఆయన వెళ్ళిపోవాలి. ఈ ఏర్పాటుతో కొద్దికాలం జరిగింది.

“ఒకనాడు హఠాత్తుగా మీ సేవకుడు ఫిలిప్పి మా కంటపడ్డాడు. మా ఇద్దరి పని అయిపోయిందనే భయం కలిగింది. భయంతోనే ఒక కేకపెట్టాను. నా ప్రియుడు ‘నీవు ఈదుకుంటూ వెళ్ళిపో. వీడి సంగతి నేను చూస్తాను’ అన్నాడు.

“ఎంతో బాధతో, ఉద్రేకంతో ఈదసాగాను. ఎంతో ఆయాసం వచ్చింది. దాదాపు మునిగిపోయే స్థితి వచ్చింది. ఎలాగో ఒడ్డుచేరాను.

“ఇంటికొచ్చాక ఏదో ఘోరం జరగక తప్పదనే నమ్మకంతో వున్నాను. ఒకగంట గడిచాక ఫిలిప్పి వొచ్చాడు. నాతో రహస్యంగా ‘అమ్మగారి బానిసను. ఏమైనా ఉత్తరాలుంటే తీసుకొని వెళ్తాను’ అన్నాడు. వీడు తనను తాను అమ్ముకున్నాడనీ, నా ప్రియుడు వీణ్ణి కొన్నాడనీ నాకు అర్థమైంది.

“ఆనాటి నుంచీ వాడే మా ఇద్దరిమధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుతూండేవాడు. ఈ విధంగా రెండు నెలలు గడిచినవి. వాడంటే మా ఇద్దరికీ మంచి నమ్మకం వుంది. మీ దృష్టిలో కూడా వాడు నమ్మకమైన సేవకుడేగా!

“ఆ తరువాత ఏం జరిగిందో చూడండి. ఒకనాడు మామూలుగానే ద్వీపానికి ఈదుకుంటూ వెళ్ళాను. కాని అక్కడ నా ప్రియుడు లేదు. ఈ సేవకుడు ఉన్నాడు. వీడు నాకోసమే వేచి ఉన్నాడు. నేను తనకు లొంగకపోయినట్లయితే నా రహస్యాలనూ, ఉత్తరాలనూ మీకు చూపుతానని బెదిరించాడు.

"తండ్రీ! అప్పుడు నాకు ఎంత భయం వేసిందనీ! నాతోపాటు నా ప్రియుడు కూడా శిక్షించబడతాడు. స్త్రీని, అనాధను, దుర్బలను, పాపిని భయంతో వణికిపోయాను. మీరు నేనంటే ఎంత దయగా ఉండేవారు. ఈ సంగతులన్నీ మీకు తెలిస్తే నేను బజారులో దుమ్ములో పొర్లాడవలసిందే కదా! అయితే ఈ దుర్మార్గుడు చేసిన పనిని మీకు చెప్పినట్లయితే వాణ్ణి మీరు అప్పుడే చంపి వుందురు. నాకు తెలుసు. నా సౌఖ్యం కోసమై మీరు ఏమైనా చేయగలరు! కాని నా పతనాన్ని మీరు వినరాదని నిశ్చయించుకున్నాను.

"నాకు పిచ్చెక్కింది. తల తిరిగిపోయింది. ఎంత సాహసానికైనా ఒడికట్టాలనిపించింది. వీడు కూడా నన్ను ప్రేమిస్తున్నాడు. యీ రహస్యాన్ని కాపాడుకునేందుకు అందరి మనశ్శాంతి కోసం వీణ్ణి మరోసారి కొనెయ్యాలనుకున్నాను.

"మేము ఆడవాళ్ళం- దుర్బలులం. మీకన్న ముందుగా, తేలిగ్గా మాకు మతిపోతుంది. స్త్రీ ఒకసారి కాలుజారిందో, తరువాత అంతకన్న కిందిమెట్టుకు దిగజారక తప్పదు. ఇదంతా బైటపడిందంటే మీరో, నా ప్రియుడో ఎవరో ఒకరు చావకతప్పదు. మీలో ఎవరు చావటమూ నాకు ఇష్టం లేదు. అంతకుమించి ఆలోచన లేకుండా, మతిపోయినట్లయి నేను ఈ వెధవకు లొంగిపోయాను.

"నేను చేసిన పనికి మీనుంచి క్షమను కోరలేను. నేను అనుకున్నంతా అయింది. ఇదే పద్ధతిలో నన్ను మాటిమాటికీ భయపెడుతూ అనుభవించసాగాడు. నాలోని లోపాన్ని, బలహీనతను తనకు అనుకూలంగా తిప్పుకున్నాడు. ఈ నీచాన్ని నేను దాదాపు ప్రతిరోజు భరించవలసే వచ్చింది. తండ్రీ! నా పాపానికి నేను పశ్చాత్తాపపడుతున్నాను. దానికి జరిమానాగా నా ప్రాణాన్నే అర్పించేందుకు సిద్ధంగా వున్నాను. కాని ఈ సేవకుడు- ఏ యోగ్యతాలేని ఈ వెధవ, కేవలం రహస్యాన్ని దాచినందుకుగాను, నా ఇష్టాయిష్టాలతో పనిలేకుండానే నన్ను అనుభవించగలిగాడు. ఇలాంటి పాపికి శిక్షంటూ ఉందా?

"ఈ విధంగానే నేను అంత్య దశను చేరుకున్నాను. నేను చేసిన ఈ పాపాన్ని బతికివుండగా మీకు చెప్పే సాహసం లేకపోయింది. చనిపోయాక నాలో ఎంతో ధైర్యం వచ్చి ఈ వివరాలన్నీ మీకు రాయగలుగుతున్నాను. నదిలోని నీటిలోపడి ప్రాణాలు విడవటం తప్ప మరో మార్గం నాకు తోచలేదు. వేరొకవిధంగా నా ఈ పాపభూయిష్ఠ శరీరం శుభ్రపడుతుందని నాకు తోచలేదు. ఇక నేను ఎవర్నీ ప్రేమించలేను. ప్రేమించబడనూలేను. కరచాలనం చేసే అర్హత కూడా నాకు లేదనిపిస్తోంది. ఎందుకంటే ఈ పాపి చేతిని తాకినందువల్ల ఎదుటి వ్యక్తి పవిత్రతకు భంగం కలుగుతుందనే నమ్మకం నాకు కలిగింది.

"ఇప్పుడే స్నానానికని నదికి వెళ్తున్నాను. మళ్ళీ తిరిగి రావటమంటూ వుండదు. మీకు రాసిన ఈ ఉత్తరం నేను చనిపోయాక నా ప్రియుడికి వెళ్తుంది. ఈ సంగతులేమి వేరెవ్వరికీ తెలియకుండానే నా ప్రియుడు మీకీ వుత్తరాన్ని పంపుతాడు. బహుశా మీరు శ్మశానభూమి నుంచి తిరిగి వచ్చాక ఈ ఉత్తరాన్ని చదువుతారు.

"తండ్రీ! మరి సెలవు. ఇంతకన్న నేను చెప్పవలసింది లేదు. మీకు ఉచితమని తోచిన విధంగా చేయండి. నన్ను క్షమించండి."

కలొనెల్ ఫాలభాగాన్ని తుడుచుకున్నాడు. చలిగాలిలో కూడా అతని ముఖం చెమటపట్టింది! అయితే ఆత్మబలం ఉన్నవాడు కనుక తట్టుకున్నాడు. ఘోరమైన యుద్ధం జరుగుతున్నప్పుడు, రివ్వు రివ్వున ఫిరంగి గుళ్ళు తన పక్కనుంచే దూసుకుపోతున్నప్పుడు యుద్ధభూమిలో నిశ్చలంగా నిలబడగలిగిన పూర్వపు రోజుల్లోని సాహసం అతనిలో తిరిగి పొడసూపింది. గంట వాయించాడు.

ఒక సేవకుడు వచ్చాడు.

"ఫిలిప్పిని ఇక్కడికి పంపు."

సేవకుడు వెళ్ళిపోయాడు. కలొనెల్ డ్రాయర్ తెరిచాడు.

ఫిలిప్పి వెంటనే వచ్చాడు. బలిష్టమైన దేహం, ఎర్రని మీసాలు, భయంకరంగా వుండే ముఖం, మోసాన్ని వెలిబుచ్చే కళ్ళు- ఇదీ ఫిలిప్పి ఆకారం.

కలొనెల్ ఫిలిప్పి ముఖంలోకి సూటిగా చూశాడు.

"నా భార్య ప్రియుడి పేరేమిటో చెప్పు."

"కాని... కలొనెల్..."

కలొనెల్ తెరిచివున్న డ్రాయర్‌లోనుంచి రివాల్వర్ తీశాడు.

"చెప్పు త్వరగా... నేను పరిహాసమాడనని నీకు తెలుసుగా!"

"కలొనెల్! కేప్టెన్ సెయింట్ అల్బర్ట్."

ఫిలిప్పి నోటినుంచి ఆ పేరు పూర్తిగా బైటికి రాకముందే ఒక పెద్దమంట అతని కళ్ళముందు వెలిగింది. గుండు ఒకటి ఫాలభాగంలోనుంచి దూసుకుపోవటంతో అతను నేలమీద బోర్లాపడ్డాడు.